## గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 7: జిల్లాలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు నియమించిన పరిశీలకులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లాలో 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొత్తం 9,672 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలు, హాల్ టికెట్ డౌన్‌లోడ్ కోసం జిల్లా స్థాయి హెల్ప్‌లైన్ నంబరు 08455276155పై సంప్రదించాలని సూచించారు. హాల్ టికెట్‌ను http://www.tspsc.gov.in వెబ్‌సైట్ నుంచి పొందవచ్చన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష రాసే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలని ఆదేశించారు. చీఫ్ సూపరింటెండెంట్లు పరీక్ష నిర్వహణ చేపట్టాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు, పాస్ పోర్ట్, ఓటరు ఐడీ కార్డు ఇతర ప్రభుత్వ ఫొటో గుర్తింపు కార్డుల్లో ఏదో ఒకటి తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు.

### పరీక్షలకు భద్రత కట్టుదిట్టం

సంగారెడ్డి, జూన్ 7 : ఉద్యోగాల ఎంపికకు ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షలకు పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసిందని, అభ్యర్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న జరుగనున్న గ్రూప్-1 పరీక్షకు అవసరమైన కేంద్రాలను అధికారులు సిద్ధం చేశారన్నారు. అభ్యర్థులు మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్‌కు పాల్పడరాదని సూచించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు ఉంటుందని, పోలీసు చట్టాలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. పరీక్ష కేంద్రాలకు వెళ్లేందుకు ప్రత్యేకంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఆర్టీసీ అధికారులు ప్రతి కేంద్రం వరకు బస్సులు నడుపుతున్నారన్నారు.

## బాలికలను రక్షిద్దాం.. చదివిద్దాం..




కంది అంగన్‌వాడీ కేంద్రంలో భేటీ జన్మోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు

కంది, జూన్ 7 : బాలికలను చిన్నచూపు చూడకుండా వారిని రక్షించి.. ఉన్నత చదువులు చదివిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశ్వనిత పేర్కొన్నారు. బాల, బాలికలను సమానంగా పెంచాలని తల్లిదండ్రులకు సూచించారు. భేటీ బచావో- భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కంది అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో భేటీ జన్మోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలికలతో కలిసి కేక్ కట్ చేయడంతో పాటు వారి పేరుపై మొక్కలు నాటారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మహిళా చట్టాలు, ఆడపిల్లల ప్రాముఖ్యత, విద్య, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిత కేంద్రం కోఆర్డినేటర్ పల్లవి, మెడికల్ ఆఫీసర్ రమామణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్లోబల్ గ్రీన్‌లో వేతన ఒప్పందం



గ్లోబల్ గ్రీన్ ప్రతినిధులను సన్మానించిన బీఎంఎస్ నాయకులు

కోహీర్, జూన్ 7 : మండలంలోని వెంకటాపూర్ శివారులోని గ్లోబల్ గ్రీన్ పరిశ్రమలో వేతన ఒప్పందం కుదిరింది. శుక్రవారం పరిశ్రమ ప్రతినిధులు, భారతీయ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో వేతన ఒప్పందంపై చర్చించారు. కార్మికులకు రూ.8,300 పెంచుతున్నట్లు యాజమాన్యం అంగీకరించింది. దీంతో కార్మికులు సమ్మతించారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో పరిశ్రమ వీపీ జేఎస్ రావు, హెచ్‌ఆర్ నెహ్రూ రమేశ్, వెంకటేశ్, బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు మల్లేశం, సంఘం అధ్యక్షుడు మల్లారెడ్డి, సలహాదారు రవీంద్రనాథ్, వీర్‌శెట్టి, భాషా, మొగులయ్య, కృష్ణయ్య, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై వర్షపునీరు నిలువకుండా చర్యలు




జాతీయరహదారిపై నిలిచిన వర్షపునీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

రామచంద్రాపురం, జూన్ 7 : జాతీయ రహదారిపై వర్షపునీరు నిలువకుండా చర్యలు తీసుకుంటున్నామని కార్పొరేటర్ పుష్పానగేశ్ అన్నారు. ఆర్సీపురం డివిజన్‌లోని జాతీయ రహదారి సమీపంలో ఉన్న ఆర్టీసీ బస్ స్టాప్ నుంచి హెచ్‌పీ పెట్రోల్ బంక్ వరకు చిన్నపాటి వర్షానికే రహదారిపైన నీళ్లు నిలుస్తూ వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. గురువారం కురిసిన వర్షానికి రహదారిపైన వర్షపునీరు నిలువడంతో కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించి నేషనల్ హైవే డిపార్ట్‌మెంట్ అధికారులతో మాట్లాడి జేసీబీ తెప్పించి తాత్కలికంగా నీటిని తొలిగించారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌యాదవ్, భాస్కర్, మాణయ్య, జంగయ్య, పండరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అందోల్, జూన్ 7 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని ఎంపీపీ జోగుబాలయ్య హెచ్చరించారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు నకిలీ విత్తనాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నేరేడిగుంట గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీపీగా ఐదేండ్ల పాటు తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మహిళ మృతి

పుల్కల్, జూన్ 7 : శ్మశాన వాటిక సమీపంలో గుర్తు తెలియని మహిళ మృత దేహం లభ్యమైన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి 8 గంటల సమయంలో పంచాయతీ కార్మికులు రోజు వారి పనుల్లో భాగంగా అక్కడికి వెళ్లగా గుర్తు తెలియని మహిళ మృతదేహం పడి ఉందని పంచాయతీ కార్యదర్శి ధనలక్ష్మికి సమాచారం ఇచ్చారు. దీంతో ఆమె ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెకు 35 ఏండ్లు ఉంటుందని, కొన్ని రోజుల నుంచి మతి స్థిమితం కోల్పోయి పుల్కల్, మిన్పూర్, గొంగ్లూరు గ్రామాల్లో భిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళ శ్మశాన వాటిక రేకుల షెడ్డులోనే ఉండేదని తెలిపారు. మూడు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయిందని తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- ఎంఈవోలు, హెచ్‌ఎంలు
- గ్రామాల్లో కొనసాగుతున్న బడిబాట



కల్హేర్ : రాపర్తిలో బడిబాట నిర్వహిస్తున్న ఎంఈవో శంకర్

న్యాల్‌కల్, జూన్ 7 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈవో మారుతీరాథోడ్ అన్నారు. బాడిబటలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని హద్నూర్, ఖలీల్‌పూర్, మామిడ్గి, మెటల్‌కుంట, చాల్కి, రేజింతల్, వడ్డి, మామిడ్గి, మెటల్‌కుంట, డప్పూర్, అత్నూర్ తదితర గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. పాఠశాలల్లో విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం, ఉచితంగా పుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రైవేట్‌కు దీటుగా బోధన

కల్హేర్, జూన్ 7 : ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన ఉంటుందని ఎంఈవో శంకర్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాపర్తిలో బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను బోధించడంతో పాటు విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాలున్నాయని మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

### పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలి

రాయికోడ్, జూన్ 7 : పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని రాయికోడ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం విఠల్ కోరారు. శుక్రవారం రాయికోడ్‌లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నారులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించవద్దని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతులను వివరించారు. ర్యాలీలో సిబ్బంది శివకుమార్, సుధాకర్, శ్రావణి,తులసి ఉన్నారు.

### గ్రామాల్లో బడిబాట

జిన్నారం, జూన్ 7 : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు కోరారు. శుక్రవారం కొర్లకుంట, మంత్రికుంట, ఊట్ల, అండూరు, కొడకంచి, మంగంపేట, మాదారం, చెట్లపోతారం, నల్తూరు, శివనగర్, అల్లీనగర్ గ్రామాల్లో ఆయా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి బడిబాటలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

### విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన

బొల్లారం, జూన్ 7 : మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం జడ్పీ ఉన్నత, అర్బన్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులను కలిసి పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ప్రతిభారాణి, సత్యనారాయణ, త్రిశూల్, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.

### గుమ్మడిదలలో..

గుమ్మడిదల, జూన్ 7 : బడీడు చిన్నారులను ప్రభుత్వ బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారం చేశారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజు ఆధ్వర్యంలో బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డి, సుబ్బలక్ష్మి తదితరులుపాల్గొన్నారు.



న్యాల్‌కల్ : వడ్డి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతున్న ఉపాధ్యాయులు

## చెరువులో జారిపడి వివాహిత మృతి

అమీన్ పూర్, జూన్ 7 : పెద్ద చెరువులో ఓ వివాహిత జారిపడి గల్లంతైన ఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు... అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సాయి ధామ్ కాలనీలో నివసించే రవితేజతో కలిసి భార్య జయశ్రీ గురువారం స్థానిక పెద్ద చెరువు సందర్శనకు వెళ్లారు. ఈ క్రమంలో జయశ్రీ ప్రమాదవశాత్తు చెరువు గట్టు నుంచి జారి నీటిలో పడింది. వెంటనే భర్త రవితేజ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో స్థానిక ఫైర్ సిబ్బంది పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం గజ ఈతగాళ్లతో గాలింపు ముమ్మురం చేయగా మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మల్లన్నగుట్టల్లో పులిసంచారం..!

హత్నూర, జూన్ 7 : హత్నూర శివారులోని మల్లన్నగుట్టల్లో పులి సంచరిస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం సోషల్‌మీడియాలో చక్కర్లు కొట్టడంతో సమీప గ్రామాల ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. బ్రాహ్మణగూడ గ్రామానికి చెందిన గొర్లకాపరి ఒకరు మల్లన్నగుట్టల్లో పులికనిపించిందంటూ స్థానికులకు తెలియజేయడంతో వారు సోషల్ మీడియాలో వైరల్ చేయడంతో సమీప గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ విషయమై హత్నూర ఎస్సై సుభాశ్‌ను సంప్రదించగా తన దృష్టికి వచ్చిందని వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. శనివారం ఉదయం మల్లన్నగుట్టల్లో పర్యటించనున్నట్లు తెలిపారు.

### 10న గుమ్మడిదలలో తైబజార్

గుమ్మడిదల, జూన్ 7 : గుమ్మడిదలలో ఈ నెల 10న తైబజార్ వేలం పాట నిర్వహించనున్నట్లు జీపీ కార్యదర్శి ఒక ప్రకటలో తెలిపారు. తైబజార్ వేలం పాటలో పాల్గొనే వారు ఉదయం 11గంటల్లోపు రూ.25 వేలు ధరావత్తు చెల్లించాలని కోరారు. ఇందులో పాల్గొనే వారికి పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండరాదని ఆయన తెలిపారు. రూ.100 బాండ్ పేపరుపై 6 నెలల పోస్ట్ డేట్‌తో చెక్కులను గ్రామ పంచాయతీకి అందచేయాలని కోరారు.

### పారిశుధ్య కార్మికులకు యూనిఫామ్స్ పంపిణీ

బొల్లారం, జూన్ 7 : బొల్లారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి ఆధ్వర్యంలో యూనిఫామ్స్ పంపిణీ చేశారు. శుక్రవారం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిషనర్ మంగతాయారుతో కలిసి ఆమె కార్మికులకు దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

## బడి 'బాట' ఎలా...?



కోహీర్‌లో సికిందర్‌వాడీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణ దుస్థితి ఇది

కోహీర్, జూన్ 7 : ఓ వైపు బడిబాట.. మరో వైపు పాఠశాల ఆవరణ చెత్తమయం. కోహీర్ పట్టణంలోని సికిందర్‌వాడీ కాలనీ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో శుక్రవారం నాటి దుస్థితి ఇది. విద్యాశాఖ ఆధ్వర్యంలో బడిబాట పేరుతో బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలనే సదుద్దేశంతో ఓ మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కానీ పాఠశాలల ఆవరణ ఎలా ఉందో గమనించకపోవడం విడ్డూరంగా ఉంది. పాఠశాలకు వెళ్లే బాటపైనే చెత్తను పారవేశారు. కానీ విద్యాశాఖ అధికారులు, పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. పాఠశాల ప్రారంభమైనా కూడా పరిస్థితి ఇలాగే ఉంటే మాత్రం విద్యార్థులు అనారోగ్యం పాలు కావాల్సిందే. ఈ నెల 12న విద్యా సంస్థలు తెరుచుకోనున్నాయి. మండల పంచాయతీ అధికారి రఘును వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి ప్రస్తుతం సెలవులో ఉన్నాడన్నారు.

### మాకు ఎవరూ చెప్పలేదు...



కోహీర్‌లోని సికిందర్ వాడీ ప్రాథమిక పాఠశాల ఆవరణ చెత్తతో నిండి ఉందని మాకు ఎవరూ చెప్పలేదు. గ్రామ పంచాయతీ అధికారులు సమస్యను పరిష్కరించాలి. తరగతులు ప్రారంభం కాకముందే పాఠశాల ఆవరణను శుభ్రం చేయాలి. లేని పక్షంలో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారుతుంది.

**- శంకర్, ఎంఈవో, కోహీర్**

## రెండో వార్డులో 'ఫ్రైడే డ్రైడే'



బీసీ కాలనీలో మహిళలకు నిల్వ ఉన్న నీటిపై అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

బొల్లారం, జూన్ 7: మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డు బీసీ కాలనీలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు ఆదేశాల మేరకు 'ఫ్రై డే డ్రై డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ గోపాలమ్మ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్ ఇంటింటికీ వెళ్లి మహిళలకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సిరిపురంలో ఫర్టిలైజర్ దుకాణం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, జూన్ 7 : ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని సిరిపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఫర్టిలైజర్ దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డీలర్లు ప్రభుత్వ గుర్తింపు పొందిన వాటిని మాత్రమే విక్రయించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నరేందర్, వెంకట్‌రెడ్డి, మాణిక్యారెడ్డి, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ ఎంపీ విజయోత్సవ ర్యాలీ

నారాయణఖేడ్, జూన్ 7 : జహీరాబాద్ ఎంపీగా సురేశ్ ఎన్నికైన నేపథ్యంలో శుక్రవారం నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ శ్రేణు లు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంపీతో పాటు ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక వాహనంలో ప్రజలకు అభివాదం చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు. మంగల్‌పేట్ దుర్గా మాత ఆలయం నుంచి శివాజీ చౌక్ వరకు సాగిన ఊరేగింపులో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు ఎంపీ, ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## పల్లెల పరిశుభ్రత.. అందరి బాధ్యత



బేగంపేటలో డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ కొండల్‌రెడ్డి

కంది, జూన్ 7 : పల్లెల పరిశుభ్రంత అందరి బాధ్యత అని జడ్పీటీసీ కొండల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బేగంపేటలో శుక్రవారం డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జడ్పీటీసీ నిధులు రూ.2లక్షలతో ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వర్షాలు ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సాయిగౌడ్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌గౌడ్, రాజేందర్ నాయక్, వేణుగౌడ్, వెంకటేశ్, హరి, ప్రభుగౌడ్, నర్సింగ్‌రావు, శ్యాంగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మునిపల్లి, జూన్ 7 : వోక్సెన్ యూనివర్సిటీ గార్డెన్‌గా పని చేస్తున్న సంగమేశ్వర్ అదృశ్యమై.. శవమై లభ్యమైన విషయం తెలిసిందే. ఈ ఘటనతో ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులు శుక్రవారం యూనివర్సిటీ ఎదుట ఆందోళన చేపట్టారు. దీంతో విధులు నిర్వహిస్తూ మృతి చెందడంతో యాజమాన్యం కల్పించుకొని మృతుడి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం రూ.లక్ష అందజేశారు. మిగతా రూ.22లక్షల 50వేలు చెక్కు రూపంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు, మండలంలోని ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న యాజమాన్యం

## ఈదురుగాలులకు ఫౌల్ట్రీఫాం ధ్వంసం



కొన్యాల శివారులో ఈదురుగాలులకు ధ్వంసమైన ఫౌల్ట్రీఫాం

హత్నూర, జూన్ 7 : మండల పరిధిలో గురువారం రాత్రి ఈదురుగాలులతోకూడిన వర్షం కురువడంతో కొన్యాల గ్రామానికి చెందిన బడంపేట మల్లయ్యకు చెందిన ఫౌల్ట్రీఫాం ధ్వంసమైనట్లు బాధితుడు వాపోయాడు. ఈదురు గాలులకు ఫౌల్ట్రీఫాం పైకప్పురేకులు గాల్లోఎగిరికొద్ది దూరంలోపడి పగిలిపోవడంతోపాటు గోడలు పూర్తిగా ధ్వంసం కావడంతో రూ.లక్షల్లో ఆస్తినష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరారు.

## వేర్వేరు ఘటనలో ఇద్దరు మృతి

దుబ్బాక, జూన్ 7 : మండల పరిధిలోని శుక్రవారం జరిగిన వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. దుబ్బాక పోలీసులు తెలిపిన వివరాలు.. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేటలో చెట్ల నర్సయ్య (68) స్థానిక పెద్ద చెరువు వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. దుబ్బాక మండలంలోని పెద్దగుండావెళ్లిలో గొర్రెల కాపరి గుడూరి మల్లయ్య (53) శుక్రవారం ఉదయం గొర్రెలు కాపాడేందుకు వెళ్లాడు. స్థానిక చెరువులో గొర్రెలు నీట మునిగిపోవడంతో వాటిని కాపాడేందకు వెళ్లిన మల్లయ్య అందులో పడి మృతి చెందాడు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగరాజు తెలిపారు.

# పత్తి వైపు.. రైతుల చూపు

- ఏటేటా పెరుగుతున్న పత్తి సాగు విస్తీర్ణం
- విత్తన నిర్ధారణ పరీక్షలో నిమగ్నమైన వ్యవసాయాధికారులు

న్యాల్‌కల్, జూన్ 7 : మండలంలోని రైతులు పత్తి సాగు వైపు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో పత్తికి అధిక ధర లభిస్తుండడంతో ఈ పంటను అధిక మొత్తంలో సాగు చేస్తున్నారు దీంతో మండలంలోని గ్రామాల్లో ఏటేటా పత్తి విస్తీర్ణం పెరుగుతూ వస్తున్నది. ప్రస్తుత వానకాలం సీజన్‌లో మండల పరిధిలో 38 వేల ఎకరాల్లో ఈ పంట సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. మండలంలోని హద్నూర్, చాల్కి, న్యాల్‌కల్, గంగ్వార్ గ్రామాలతో పాటు జహీరాబాద్, బీదర్, నారాయణఖేడ్, వట్‌పల్లి తదితర ప్రాంతాల్లోని దుకాణాల నుంచి విత్తనాల ప్యాకెట్లను పెద్ద మొత్తంలో కొనుగోలు చేస్తున్నారు. కురుస్తున్న వర్షాలతో వాతావరణం విత్తనాలు వేసేందుకు అనువుగా ఉండడంతో మండలంలోని చాలా గ్రామాల్లో విత్తనాలు సాగు చేసే పనిలో నిమగ్నమయ్యారు. మరి కొందరు రైతులు పొలాల్లో విత్తనాలు విత్తుతున్నారు. మండలంలోని గంగ్వార్, న్యాల్‌కల్, చాల్కి, ముంగి, డప్పూర్ తదితర గ్రామాల్లోని డీలర్ల షాపులో సీలు చేసి విత్తనాలు విక్రయిస్తుంటారు. విత్తనాల ప్యాకెట్లు సీల్ చేసి ఉండడంతో రైతులు డీలరుపై ఉన్న నమ్మకంతో కొనుగోలు చేస్తారు. ఉత్పత్తి సందర్భంలోలేదా కొన్నిచోట్ల డీలర్లు చేతివాటం ప్రదర్శించి వాటిలో నాణ్యతను నీరు గార్చి, కల్తీ చేస్తారనే ఆరోపణలున్నాయి. వీటిని అరికట్టేందుకు మండల వ్యవసాయాధికారి లావణ్య ఆయా గ్రామాల్లోని విత్తన షాపులను సందర్శించి విత్తన నిర్ధారణ పరీక్షల కోసం పత్తి విత్తనాల ఫ్యాకెట్లలోనుంచి శ్యాంపిల్ సేకరిస్తున్నారు. సేకరించిన విత్తనాలను రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన కేంద్రానికి పంపుతామని వ్యవసాయాధికారులు తెలుపుతున్నారు. అక్కడ పరీక్షల అనంతరం విత్తన నిర్ధారణ పరీక్షల ఫలితాల మేరకు విత్తన డీలర్లపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పత్తి విత్తనాల కొనుగోలు సమయంలో లైసెన్సు ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలు తీసుకోవాలని, వాటికి సంబంధించిన రసీదులను తప్పని సరిగా తప్పని సరిగా రైతులు తీసుకోవాలని సూచిస్తున్నారు.



నాల్‌కల్‌లోని డీలర్ షాపులో నిర్ధారణ పరీక్ష కోసం పత్తి విత్తనాల ప్యాకెట్లలో నుంచి శ్యాంపిల్ సేకరిస్తున్న అధికారులు



హద్నూర్ శివారులో పత్తి విత్తనాలను విత్తుతున్న కూలీలు